@netifocusnews @focustv www.netifocusnews.com
http://epaper.netifocusnews.com
TS-18-0006625

FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...


తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || ఆదివారం 09, జూన్ 2024 || పేజీలు: 04

# అక్షర యోధుడి అస్తమయం

## ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు కన్నుమూత

- గుండెపోటుతో తీవ్ర అస్వస్థతకు గురైన రామోజీ గ్రూప్ సంస్థల చైర్మన్
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస
- రామోజీ ఫిలింసిటీకి భౌతికకాయం తరలింపు
- రాష్ట్రపతి, ప్రధాని సహా పలువురు రాజకీయ, సినీ ప్రముఖుల సంతాపం
- ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నేడు ఫిలింసిటీలో అంత్యక్రియలు



నేటి ఫోకస్ న్యూస్, రంగారెడ్డి-జూన్ 08:

ప్రముఖ వ్యాపారవేత్త, రామోజీ గ్రూపు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు (88) కన్నుమూశారు. ఈ నెల 5న గుండెపోటుతో తీవ్ర అస్వస్థతకు గురైన రామోజీని కుటుంబ సభ్యులు నానక్ రాంగూడలోని స్టార్ ఆస్పత్రికి తరలించారు. గుండె పనితీరు దెబ్బతిన్నదని, బీపీ పడిపోయిందని గుర్తించిన వైద్యులు.. ఆయనకు వెంటిలేటర్ అమర్చారు. యాంజియోగ్రామ్ చేసి గుండె నాళాల్లో స్టంట్ వేశారు. అయినా ఆయన కోలుకోలేదు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఆరోగ్యం మరింతగా క్షీణించి.. శనివారం తెల్లవారుజామున 4.51గంట లకు తుదిశ్వాస విడిచారు. ఆస్పత్రి నుంచి ఆయన భౌతిక కాయాన్ని ఉదయం 7.45 గంటలకు రామోజీ ఫిలింసిటీకి తెచ్చారు. రామోజీ మరణ వార్త తెలిసి రాజకీయ, సినీ, వ్యాపార ప్రముఖులు, అభిమానులు సంతాపం వ్యక్తం చేశారు. ఫిలింసిటీలో రామోజీ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. రామోజీతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

### నేడు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు..

ఆదివారం ఉదయం 10 గంటలకు ఫిలింసిటీలోని నాగన్‌పల్లి-అనాజ్‌పూర్ గ్రామాల మధ్యలో ప్రత్యేకంగా నిర్మించిన స్మృతివనంలో రామోజీరావు భౌతికకాయానికి మిగతా 2లో..



# నేడు మోదీ మూడోసారి

## రాత్రి 7.15 గంటలకు ప్రమాణ స్వీకారం

- మంత్రివర్గ కూర్పుపై కొనసాగుతున్న కసరత్తు
- మిత్రపక్షాలతో అమిత్ షా, రాజ్‌నాథ్, నడ్డా మంతనాలు
- టీడీపీ నుంచి రామ్మోహన్ నాయుడు
- జేడీయూ నుంచి లలన్‌సింగ్, సంజయ్ ఝూలలో ఒకరు

నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-జూన్ 08:

నరేంద్ర మోదీ 3.0 ఆదివారం నుంచి మొదలుకానుంది. రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం రాత్రి 7.15 గంటలకు ప్రధానిగా నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మూడుసార్లు ప్రధానిగా చేసిన జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును సమం చేయనున్నారు. బీజేపీకి సొంతంగా 240 సీట్లు మాత్రమే మిగతా 2లో..





# ఉబ్బసం రోగుల కోసం చేప ప్రసాదం

- ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్, స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎంపీ అనిల్‌కుమార్..
- భారీ ఏర్పాట్లు చేసిన వివిధ ప్రభుత్వ శాఖలు

నేటి ఫోకస్ న్యూస్, అబిడ్స్-జూన్ 08:

ఉబ్బసం రోగుల కోసం చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమం నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో శనివారం ఉదయం ప్రారంభమైంది. రెండురోజుల పాటు బత్తిని కుటుంబం ఆ ధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాన్ని శాసనసభ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్పీకర్ గడ్డం ప్రసాద్ మిగతా 2లో..





# నేడు గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష

- ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిన ఆర్టీసి

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూన్8:

తెలంగాణలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు సర్వం సిద్ధమైంది.. ఆదివారం జరగనున్న గ్రూప్ 1 పరీక్ష కోసం 897 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. గ్రూప్-1 ప్రిలిమనరీ పరీక్ష నేపథ్యంలో తెలంగాణ ఆర్టీసీ కీలక ప్రకటన చేసింది. పరీక్ష రాసే అభ్యర్థుల సౌకర్యార్థం టిజి ఆర్‌టిసి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని.. రవాణా మిగతా 2లో..



## ఢిల్లీలో బిజీగా సిఎం రేవంత్

కాంగ్రెస్ నేతలు రాహుల్, ప్రియాంకకు అభినందనలు

# విపక్ష నేతగా రాహుల్

- సీడబ్ల్యూసీ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం..
- రాహుల్ జోడో యాత్రతో కాంగ్రెస్‌కు ఆదరణ
- ఎన్నికల్లో ఎన్నో రకాలుగా అడ్డంకులు సృష్టించారు
- అయినా కాంగ్రెస్ ధైర్యంగా నిలబడి గెలిచింది
- సమావేశ వివరాలను వెల్లడించిన కెసి వేణుగోపాల్

నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-జూన్8:

కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీని ఆ పార్టీ లోక్‌సభ పక్ష నేతగా బాధ్యతలు చేపట్టాలని సీడబ్ల్యూసీ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ తెలిపారు. శనివారం ఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీ అయ్యింది. సుమారు మూడు గంటల పాటు ఈ సమావేశం సాగింది. సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న మిగతా 2లో..



నేటి ఫోకస్ న్యూస్
అమ నిత్యం...ప్రజా పక్షం...
ఆదివారం 09, జూన్ 2024

# అక్షర యోధుడి అస్తమయం

(మొదటి పేజీ తరువాయి..)

అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. రామోజీరావు అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్న ట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాల కోసం ఢిల్లీకి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో ఫోన్‌లో మాట్లాడి ఈ మేరకు సూచ నలు చేశారు. దీంతో ఏర్పాట్లను పర్యవేక్షించాల్సిందిగా రంగారెడ్డి కలెక్టర్, రాచకొండ పోలీస్ కమిషనర్‌లను సీఎస్ ఆదేశించారు.

# విపక్ష నేతగా రాహుల్

(మొదటి పేజీ తరువాయి..)

నిర్ణయాల గురించి కేసీ వేణుగోపాల్ మీడియాకు వెల్లడించారు. సిడబ్ల్యూసీ సమావేశంలో లోక్‌సభ ఎన్నికలపై, ఎన్నికల ఫలితాలపై చర్చిం చామన్నారు. సీబీఐ, ఈడీ సంస్థలతో కాంగ్రెస్ నేతలను బ్లాక్‌మెయిల్ చేశా రన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. కిందిస్థా యి నుంచి పై స్థాయి వరకు కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని చెప్పారు. కాంగ్రెస్ పని అయిపోయిందని చాలా మంది కామెంట్స్ చేశారని.. ఎగ్జిట్ పోల్స్‌పై పోరాటం చేశామని కేసీ వేణుగోపాల్ చెప్పుకొచ్చారు. ఇండియా కూటమి ఎజెండాను పక్కదోవ పట్టించే విధంగా వ్యవహరించారని కేసీ విమర్శించారు. మల్లికార్జున ఖర్గే కాంగ్రెస్ పార్టీ కోసం చేసిన కృషిని సీడబ్ల్యూసీ సమావేశంలో అభినందించామన్నారు. ఓట్లేసిన ప్రజలకు కాంగ్రెస్ నేతలు అభినందనలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ అన్నీ అబద్దాలు చెప్పారని కేసీ వేణుగోపాల్ విమర్శించారు. పార్టీ గెలుపు కోసం పని చేసిన ప్రతి ఒక్కరికి ఈ సమావేశంలో కాంగ్రెస్ ధన్యవాదాలు తెలి పింది. రాహుల్ గాంధీ చేసిన రెండు యాత్రలు కాంగ్రెస్ గెలుపునకు కలిసి వచ్చాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. తమతో కలిసి వచ్చిన కూటమి నేతలకు సైతం కాంగ్రెస్ ధన్యవాదాలు తెలిపింది. సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యాన్ని కాపాడడంలో కాంగ్రెస్ ముందుంటుందని కేసీ వేణు గోపాల్ ఉద్ఘాటించారు. లోక్ సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ ఉండాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీతోపాటు సీఎం రేవంత్ రెడ్డి, కర్నాటక సీఎం సిద్ధరామయ్య, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుక్విందర్ సింగ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివ కుమార్, తదితర కీలక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోక్ సభ ప్రతిపక్ష నేతను ఎన్నుకోవడంతోపాటు పలు అంశాలపై చర్చించారు. సార్వత్రిక ఎన్నికల్లో కేరళలోని వాయనాడ్ సీటును, ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ స్థానాల్లో ఘన విజయం సాధించిన రాహుల్ గాంధీని ప్రతిపక్ష నేతగా ప్రతిపాదించారు. త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నట్లు కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ వేణుగోపాల్ తెలిపారు. పార్లమెంటులో ప్రతిపక్షనేతగా నాయకత్వం వహించడానికి రాహుల్ సరైన వ్యక్తి అన్నారు. ఎన్నికల ప్రచారం, గ్యారంటీలపై కూడా సమావేశంలో చర్చించామన్నారు. ఎన్నికల సమయంలో బ్యాంక్ అకౌంట్లు ఫ్రీజ్ చేసినా, కాంగ్రెస్ నేతలను బెదిరించినా.. బీజేపీకి గట్టి పోటీ ఇచ్చామన్నారు. రాజ్యాంగం, ప్రజస్వామ్యాన్ని రక్షించడానికి కాంగ్రెస్ కార్యకర్తలు యోధుల్లా పోరాడారని కేసీ వేణుగోపాల్ అన్నారు.

# నేడు మోదీ మూడోసారి

(మొదటి పేజీ తరువాయి..)

రాగా... మిత్రపక్షాలతో కలిపి ఎడ్డీయే 293 సీట్లతో మెజారిటీ సాధించింది. సొంతంగా మెజారిటీ లేని నేపథ్యంలో మంత్రిపదవులపై మిత్రుల డిమాండ్లను తీర్చడం బీజేపీకి కత్తిమీద సాములా మారింది.

శనివారం కూడా బీజేపీ సీనియర్ నేతలు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా మిత్రపక్షాలతో సంప్రదింపులు కొనసాగించారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు (16 సీట్లు), జేడీయూ అధ్యక్షుడు నితీశ్ కుమార్ (12 సీట్లు), శివసేన అధ్యక్షుడు, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే (7 సీట్లు)లతో మంత్రి పదవులపై చర్చలు జరిపారు. పెద్దశాఖలైన హోం, ఆర్థిక, రక్షణ, విదేశీ వ్యవహారాలతో పాటు సైద్ధాంతికంగా కీలకమైన విద్య, సాంస్కృతిక శాఖలను బీజేపీయే అట్టిపెట్టుకుంటుందని భావిస్తున్నారు. మొదటి విడతలో మిత్రపక్షాలకు ఐదు నుంచి ఎనిమిది మంత్రి పదవులు దక్కవచ్చని సమాచారం.

### టీడీపీకి ఒక కేబినెట్, ఒక సహాయమంత్రి..

టీడీపీ నుంచి కింజారపు రామ్మోహన్ నాయుడుకు కేబినెట్ పదవి దక్కనుంది. పెమ్మసాని చంద్రశేఖర్‌కు సహాయమంత్రి పదవి లభిస్తుందని విశ్వసనీయవర్గాల సమాచారం. రెండు పార్టీలు టీడీపీ, జేడీయూలకు ఒక్కో కేబినెట్, ఒక్కో సహాయమంత్రి పదవులు ఇవ్వనున్నారు. జేడీయూ నుంచి లలన్ సింగ్, సంజయ్ ఝూలలో ఒకరు కేబినెట్ మంత్రిగా, రామ్‌నాథ్ ఠాకూర్ సహాయమంత్రిగా ఆదివారం మోదీతో పాటు ప్రమాణ స్వీకారం చేస్తారని సమాచారం. లోక్ జనశక్తి (రాంవిలాస్) నుంచి ఆ పార్టీ అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్‌కు కేబినెట్‌లో చోటు దక్కనుంది.

# నేడు గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష

(మొదటి పేజీ తరువాయి..)

పరంగా ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక బస్సులను నడప నున్నట్లు పేర్కొంది. ఈ మేరకు టీజీఆర్టీసీ ఎండీ సజ్జనార్ ట్వీట్ చేసి వెల్ల డించారు. గ్రూప్-1 ప్రిలిమనరీ పరీక్ష రాసే అభ్యర్థుల సౌకర్యార్థం టిజిఆ ర్టిసి ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అభ్యర్థులకు ఆదివారం రవాణా పరంగా అసౌకర్యం కలగకుండా ప్రత్యేక బస్సులను నడుపుతోంది. రాష్ట్రం లోని 897 పరీక్షా కేంద్రాలకు బస్సులను నడపాలని క్షేత్రస్థాయి ఆర్టీసీ అధికారులకు ఇప్పటికే సంస్థ యాజమాన్యం ఆదేశాల్విడం జరిగిందని సజ్జ నార్ తెలిపారు. తెలంగాణలో రేపు ఉ.10:30గంటల నుంచి మ.1 గంట వరకు గ్రూప్-1 పరీక్ష జరుగుతుంది. ఉ.10 గంటల లోపు అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. 4.03లక్షల మంది పరీక్ష రాయనున్నారు.

- నిమిషం ఆలస్యమైనా అనుమతించరు.
- కార్డు, హాల్ టికెట్, ఫొటో తప్పనిసరి.
- అభ్యర్థులు చెప్పులు ధరించి మాత్రమే రావాలి. బూట్లు ధరించకూడదు.
- ఆభరణాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధం.
- బయోమెట్రిక్ వేలిముద్ర వేయాల్సి ఉండటంతో వేళ్లపై మెహెందీ/ఇతర ప్రింటెడ్ రంగులు ఉంచుకోరాదు.

# ఉబ్బసం రోగుల కోసం చేప ప్రసాదం పంపిణీ











(మొదటి పేజీ తరువాయి..)

కుమార్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్, టీపీసీసీ కార్యనిర్వహణ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మీడియాతో మా ట్లాడుతూ, 150 సంవత్సరాలుగా మృగశిరకార్తెను పురస్కరించుకుని బత్తిన కుటుంబీకులు ఉచితంగా, సేవాభావంతో లక్షలాది మందికి చేపప్రసాదం పంపిణీ చేస్తున్నారన్నారు. తెలంగాణతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వచ్చిన వేలాది మంది అస్తమా రోగుల సౌకర్యార్థం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు.

### 32 కౌంటర్ల ద్వారా చేపప్రసాదం...

జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ, వాటర్ బోర్డు, విద్యుత్, రెవెన్యూ, మత్స్యశాఖ, పోలీస్‌శాఖ, ట్రాఫిక్ శాఖ లతో పాటు పలు శాఖల అధికారులు చేపప్రసాద పంపిణీకోసం భారీ ఏర్పాట్లు చేశారని పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా లన్ని శాఖల అధికారులు ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని, 32 కౌంటర్ల ద్వారా చేపప్రసాదం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వాటర్‌బోర్డు ఆధ్వర్యంలో మంచినీరు సరఫరా చేయగా, పలు స్వచ్ఛంద సేవా సంస్థలు రోగులకు అల్పాహారం అందించాయి.

వాటర్‌బోర్డు ఆధ్వర్యంలో దాదాపు 6 లక్షల మంచినీటి ప్యాకెట్లు ఉచితంగా అందించారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్ పరిసరాల్లో పెద్దఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్స్ యాదవ్ ఆధ్వర్యంలో అబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్, బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్‌లు భారీ బందోబస్తు ఏర్పాటు చేశా రు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో దాదాపు 60వేల చేపపిల్లలను శనివారం రాత్రి వరకు విక్రయించినట్లు మత్స్యశాఖ అధికారులు వెల్లడించారు. ఆదివారం వరకు చేపప్రసాదం పంపిణీ జరుగనుందని వెల్లడించారు.

### క్యూలైన్‌లో సొమ్మసిల్లి మృతి..

చేపమందు కోసం హైదరాబాద్ వచ్చిన నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం తాళ్లరామడుగు గ్రామానికి చెందిన మామిడి గొల్ల రాజన్న (65) తొక్కిస లాటలో మృతి చెందాడు. శనివారం ఉదయం క్యూలైన్‌లో వేచి ఉన్నప్పుడు, ఒకేసారి జనాన్ని పంపించడంతో తోపులాట జరిగి రాజన్న కిందపడిపోయాడు. అంబులెన్స్‌లో అతన్ని ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

# ఢిల్లీలో బిజీగా సిఎం రేవంత్

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-జూన్8:**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో బిజీగా ఉన్నారు. ఏఐసిసి అగ్రనేత సోనియాగాంధీతో భేటీ సీఎం రేవంత్ రెడ్డి అయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ విజయం, పార్టీలో తాజా రాజకీయ పరిణామాలు ఇతర అంశాలపై చర్చించనున్నారు. ఢిల్లీలో జరిగే సీడబ్ల్యూసీ సమావేశానికి ఆయన హాజరు అయ్యారు. ఈ క్రమంలోనే ఆయన పార్టీ నేతలతో మంత్రివర్గ విస్తరణకు సంబంధించిన అంశాలపై చర్చించే అవకాశం ఉందని చెబుతున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రేవంత్ రెడ్డి ఇప్పటి వరకు మంత్రివర్గాన్ని విస్తరించలేదు. ఇదిలావుంటే పార్టీ మంచి ఫలితాలు సాధించినందుకు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ప్రియాంకలను సిఎం రేవంత్ అభినందించారు. ఇదిలావుంటే తెలంగాణలో నామినేటడె పోస్టుల కోసం నేతలు ఎదురు చూస్తున్నారు. తాజాగా లోక్‌సభ ఎన్నికలు ముగియనున్న నేపథ్యంలో ఈ అంశంపై చర్చించే అవకాశం ఉంది. నామినేటెడ్ పోస్టుల భర్తీ, పీసీసీ కొత్త అధ్యక్షుడి ఎంపికపై చర్చించనున్నట్లు సమాచారం. సీడబ్ల్యూసీ సమావేశంలో తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపదాస్ మున్షి కూడా పాల్గొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ నేతలు వంశీ చంద్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, ఇతర నేతలు కూడా హాజరు అయ్యారు. మంత్రివర్గ విస్తరణ జరిగితే తనకు అత్యంత సన్నిహితులకు అవకాశం ఇవ్వాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. గత ఎన్నికల్లో అందరికీ సీట్లు ఇచ్చే అవకాశం లేదు. అలాంటి వారికి ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించి మంత్రివర్గంలోకి తీసుకుంటామని గతంలో రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ హామీ మేరకు ఇద్దరు ముగ్గురు నేతలను మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం ఉందని అంటున్నారు. అందుకు తగ్గట్టుగానే పార్టీ అగ్రనాయకత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ లభిస్తే తదుపరి ప్రక్రియను పూర్తి చేసేందుకు రేవంత్ రెడ్డి సన్నాహాలు చేస్తున్నారు.

# రామోజీ మృతి పట్ల కెసిఆర్ దిగ్భ్రాంతి

- పత్రికా రంగంలో రామోజీ సేవలు అమోఘం
- నివాళి అర్పించిన మాజీ సిఎం కెసిఆర్
- భౌతిక కాయం వద్ద నివాళి అర్పించిన కెటిఆర్ తదితరులు

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూన్8:**

ప్రముఖ మీడియా నిపుణులు, రామోజీ గ్రూప్ ఛైర్మన్ రామోజీ రావు(87 మృతి పట్ల తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటు రామోజీ కుంటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేత, మాజీ ఆర్థిక మంత్రి హరీశ్ రావు కూడా రామోజీ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. పత్రికా, టీవీ, సినిమా రంగాల్లో రామోజీ సేవలతో ఎంతో మందికి ఉపాధి లభించిందని గుర్తు చేశారు. దీంతోపాటు రామోజీ శ్రమ, తపన, నిబద్ధత, క్రమ శిక్షణ కల్గిన మంచి వ్యక్తి అని హరీశ్ రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేత, మాజీ ఐటీ మంత్రి కేటీఆర్ కూడా రామోజీ మృతి పట్ల సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. రామోజీ గారి మరణం గురించి తెలుసుకుని చాలా బాధపడ్డానని ఆయన నిజమైన దార్శనికుడని అభివర్ణించారు. ఆయన జీవితం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని చెప్పారు. ఎన్నో అసమానతలు ఉన్నప్పటికీ గొప్ప విజయాన్ని ఎలా సాధించవచ్చో ఆయన జీవితం, ప్రయాణం చూస్తే అర్థమవుతుందన్నారు. ఈ క్రమంలో తెలుగు మీడియా, వినోద ప్రపంచంలో ఆయన చెరగని ముద్ర వేశారని గుర్తు చేశారు. గత దశాబ్దంలో నేను చాలాసార్లు సంభాషించే అవకాశాన్ని పొందానని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు నా హృదయపూర్వక సానుభూతి తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో రామోజీ రావు పార్థివదేహానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు జగదీశ్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్ రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలుగు పత్రికా రంగంతో పాటు తెలుగు ప్రసార మాధ్యమాల్లో ఒక విప్లవాత్మకమైన మార్పుకు రామోజీ రావు బీజం వేశారు. ఈనాడు పత్రిక స్థాపించిన తర్వాత, ఈటీవీ ద్వారా ఎల్క్ట్రానిక్ మీడియా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ప్రొఫెషనిలజంతో, విలువలతో కూడిన జర్నలిజానికి రామోజీ రావు గుర్తుగా నిలిచిపోతారు. తెలుగు భాషాభివృద్ధి కోసం ఆయన ఎంతో తపన పడ్డారు. దేశం, రాష్ట్రం బాగుండాలని కోరుకునేవారు. తెలుగు ప్రజలు, తెలంగాణ, ఏపీ రాష్ట్రాల గురించి గొప్పగా మాట్లాడేవారు. ఎన్నో సందర్భాల్లో ఇదే ఫిలిం సిటీలో వారిని కలుసుకునే అవకాశం తనకు లభించింది. మొబైల్ ఎన్‌సైక్లోపీడియా లాగా అన్ని విషయాలు చెప్పేవారు. రామోజీ మృతి తెలుగు పత్రికా రంగానికే కాకుండా ప్రపంచంలోని తెలుగు వారందరికీ తీరని లోటు అని పేర్కొన్నారు. యూనివర్సల్ స్టూడియో స్థాయిలో రామోజీ ఫిలిం సిటీని నిర్మించాలన్న విజన్ రామోజీ రావుకే ఉండే. ఆయన ఆలోచనలు, జ్ఞాపకాలు తప్పకుండా భవిష్యత్‌లో అందరికీ స్ఫూర్తిని ఇస్తాయి. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. ఎప్పటికీ తెలుగు జాతి ఆయనను గుర్తు పెట్టుకుంటుంది అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈనాడు దినపత్రిక వ్యవస్థాపకులు రామోజీ రావు మృతి చాలా బాధాకరం అని బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఇదీ సంగతి, నమ్మలేని నిజాలు, ఇది కథ కాదు, ఫాంటమ్ లాంటి విలక్షణీయ ఫీచర్స్‌తో ఈనాడు పత్రికను రామోజీ రావు నడిపిన తీరు అమోఘం. పత్రికలను చదివే అలవాటు ఈనాడు నుండే వచ్చింది. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.

# బయటపడుతున్న ధరణి అక్రమాలు

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూన్8:**

ధరణి పోర్టల్ చుట్టూ వివాదాలు సద్దు మణగలేదు. ధరణిని అడ్డం పెట్టుకుని చేసిన చేతివాటాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ప్రభుత్వ భూములను కింది స్థాయిలో అధికారులు కూడా అమ్మేసుకున్నారు. గ్రామాల్లో ధరణితో తాము నష్టపోతు న్నామంటూ ఆందోళనల చెందుతున్న వారి సంక్య పెరుగుతున్నాయి. ధరణితో కెసిఆర్, ఆయన అనుచరులు భూములను కాజేసిన వ్యవహారం మెల్లగా బయట పడుతోంది. తాజాగా రాంగారెడ్డి శంషాబాద్‌లో ప్రభుత్వ భూములను కాజేసిన తీరు ఆచ్చర్యం కలిగిస్తోంది. అయితే ధరణి మొదలు పెట్టినప్పటి నుంచే వివాదాలు, రైతుల ఆత్మహత్యల బెదిరింపులు, పంచాయితీలు, కొట్లాటలు నడిచాయి. అక్రమా లను పట్టించుకోని కెసిఆర్.. ధరణిపై విమర్శలు చేసే వారిని బంగాళాఖాతంలో విసిరేయాలని కెసిఆర్ స్వయంగా పిలుపునిచ్చారు. ఆయన ఎన్నికల ప్రచారం అంతా ఇలాగే సాగింది. మొత్తంగా ధరణి పోర్టల్ వివాదం తెలంగాణలో పెను రాజకీయ ప్రకంపనలను రేపింది. కాంగ్రెస్ అధికారం చేపట్టాక కోదండరెడ్డి అధ్యక్షతన కమిటీ వేసింది. కమిటీ దీనిపై లోతుగా అధ్యయనం చేస్తోంది.

# ఛత్తీస్‌ఘడ్‌లో ఎదురుకాల్పులు

- ఏడుగురు మావోయిస్టుల హతం

**నేటి ఫోకస్ న్యూస్, రాయపూర్-జూన్8:**

ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం మరోమారు తుపాకుల మోతతో దద్దరిల్లింది. నారాయణ్ పూర్, దంతేవాడ జిల్లాల సరిహద్దులోని గోబెల్ అటవీ ప్రాంతంలో శనివారం భారీ ఎన్ కౌంటర్ జరిగింది. పక్కా సమాచారంతో కూబింగ్ నిర్వహిస్తున్న భద్రతా దళాలకు... మావోయిస్టులు ఎదురుపడ్డారు. దీంతో రెండు వర్గాలు కాల్పులు జరిపి నట్లు తెలుస్తోంది. ఈ ఎన్ కౌంటర్‌లో.. ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతిచెందినవారు నారాయణ్ పుర్, దంతేవాడ, బస్తర్, కొండగావ్ జిల్లా వాసులుగా పోలీసులు అధికారులు గుర్తించారు. సంఘటనాస్థలం నుంచి భారీగా ఆయుధ సమాగ్రి, తుపాకులను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం ఎన్ కౌంటర్ కొనసాగుతోందని నారాయణపూర్ పోలీస్ సూపరింటెండెంట్ ప్రభాత్ కుమార్ చెప్పారు. శుక్రవారం రాత్రి జరిగిన ఎన్‌కౌంటర్‌లో నారాయణపూర్ డీఆర్‌జీకి చెందిన ముగ్గురు జవాన్లను గాయపడ్డారు. వారిని ఈస్ట్ బస్తర్ డివిజన్ పరిధిలోని గోబెల్ ప్రాంతం నుంచి విమానంలో ఆస్పత్రికి తరలించారు. మే 25న బీజాపూర్‌లోని జప్పెమార్క, కమ్‌కనార్ అడవుల్లో భద్రతా బలగాలతో జరిగిన ఎన్ కౌంటర్‌లో ఇద్దరు నక్సలైట్లు హతమయ్యారు. అనంతరం, జూన్ 2న నారాయణ పూర్ జిల్లాలోని దుర్మి గ్రామంలో నక్సలైట్లు మొబైల్ టవర్‌కు నిప్పు పెట్టారు.

# కులగణనకు మోదీని కోరుతా

## అవసరమైతే ఢిల్లీ వెల్లి ప్రధానిని కలుస్తా:మాజీ ఎంపి విహెచ్ వెల్లడి



**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూన్8:** కులగణన చేపట్టాలని ప్రధాని మోడీని కోరుతానని కాంగ్రెస్ సీనియర్ నేత కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హన్మంతరావు అన్నారు. ఈ మేరకు ఢిల్లీకి వెళ్లి మరోసారి ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసి కులగణన చేయాలని డిమాండ్ చేస్తానని వి.హనుమంతరావు అన్నారు.కేంద్రంలో మూడోసారి ఎన్డీఏ గెలవడంతో మరోసారి మోదీకి ప్రజలు అవకాశం ఇచ్చారని.. ఓటర్ల తీర్పును గౌరవిస్తామన్నారు. మోదీ ఓబీసీ ప్రధాని కానీ బడుగు బలహీనర్గాల సమస్యలను ఇప్పటికైనా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కులగణన చేస్తామని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారని గుర్తుచేశారు. రిజర్వేషన్‌లో 50 శాతం సిలింగ్ ఎత్తివేస్తామని అన్నారన్నారు. ఈరోజు ఎన్డీఏ కూటమి కీ రోల్‌లో జేడీయూ అధినేత నితీష్ కుమార్, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఉన్నారని చెప్పారు. మోదీ వారికి అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. బీహార్‌లో నితీష్ కులగణన చేస్తే 67 శాతం రిజర్వేషన్ బీసీలకు వచ్చిందన్నారు. రాహుల్ గాంధీ చేసిన ఆలోచనను మోదీ కొనసాగించాలని కోరారు. ఓబీసీ కన్వీనర్‌గా తాను ఉండి రిజర్వేషన్ పెంచాలని మోదీని గతంలో కోరానని గుర్తుచేశారు. ఐఐటీలో కూడా రిజర్వేషన్ కోసం అన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయని.. బిల్ పాస్ అయిందని తెలిపారు. మాండల్ కమిషన్ వచ్చింది కానీ బీసీలు చట్ట సభల్లో డబుల్ డిజిట్ కూడా దాటడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నితీష్, చంద్రబాబులు కూడా అన్ని రాష్ట్రాల్లో కుల గణన చేయాలని మోదీని కోరాలన్నారు. స్వాతంత్య్రం వచ్చి 70ఏళ్లు అవుతున్న బీసీలకు న్యాయం జరగడం లేదన్నారు. తెలంగాణలో కులగణన తర్వాత లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహిస్తే.. బీసీలకు మేలు జరుగుతుందని.. ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కొంత ఆలస్యమైన కులగణన తర్వాతే రాష్ట్రంలో ఎన్నికలు పెట్టాలని కోరారు. అసెంబ్లీలో కులగణన బిల్లు పాస్ చేయించిన వెంటనే కులగణనను అమల్లోకి తీసుకురావాలని కోరారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్‌లు మోదీకి వేంకటేశ్వర స్వామి విగ్రహం అందజేశారని చెప్పారు. ఏపీకి ప్రత్యేక హోదా హామీని మోదీ ఇచ్చారని.. దానిని పట్టుబట్టి అమలు చేయించాలని కోరారు. మూడోసారి ఓబీసీ ప్రధానిగా మోదీ అవుతున్నారు కాబట్టి బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎగ్జిట్ పోల్ ఫలితాలు.. సెన్సెక్స్ మీద ప్రభావం చూపాయని హనుమంతరావు పేర్కొన్నారు.

## 21వరకు కవిత జ్యూడిషయల్ కస్టడీ పొడిగింపు

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-జూన్8:** ఢిల్లీ మద్యం కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితురాలిగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు జ్యుడీషియల్ కస్టడీ కోరుతూ శుక్రవారం సీబీఐ అధికారులు రౌస్ అవెన్యూ కోర్టును ఆశ్రయించారు. దీంతో మరోసారి కవితకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగించింది. జూన్ 21 వరకు రౌస్ అవెన్యూ కోర్టు కవితకు కస్టడీని పొడిగించింది. తదుపరి విచారణను జూన్ 21వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. అదే రోజు సీబీఐ చార్జిషీట్ పరిగణనలోకి తీసుకునే అంశంపై రౌజ్ అవెన్యూ కోర్టు విచారణ జరపనున్నది. సీబీఐ కేసులో కవితపై దాఖలైన చార్జిషీట్‌ను కోర్టు విచారణకు తీసుకున్నది. తాను చదువుకోవడానికి కొత్తగా 9 పుస్తకాలు కావాలని కోర్టును కవిత కోరింది. కవిత అభ్యర్థనను రౌస్ అవెన్యూ కోర్టు అంగీకరించింది.

## సీడబ్ల్యూసీ భేటీ కోసం ఢిల్లీకి వెళ్లిన సిఎం రేవంత్

- రాష్ట్ర వ్యవహారాలపై కాంగ్రెస్ పెద్దలతో సమాలోచన

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూన్8:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిల్లీకి వెళ్లారు. దిల్లీలో జరిగే సీడబ్ల్యూసీ సమావేశంలో ఆయన పాల్గొనను న్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పెద్దలతో సీఎం సమావేశమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు మంత్రివర్గ విస్తరణ జరగలేదు. తాజాగా లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో ఈ అంశంపై చర్చించే అవకాశం ఉంది. అలాగే నామినేటెడ్ పోస్టుల భర్తీ, పీసీసీ నూతన అధ్యక్షుడి ఎంపిక తదితర విషయాలపై చర్చిస్తారని సమాచారం. సీడబ్ల్యూసీ సమావేశంలో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ కూడా పాల్గొననున్నారు. తెలంగాణ కాంగ్రెస్ నేతలు వంశీచంద్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ హాజరు కానున్నారు.

## ఆస్పత్రిలో పెచ్చులూడిన సీలింగ్..

- ఇద్దరు పిజి విద్యార్థులకు తీవ్ర గాయాలు

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూన్8:** రామంతాపూర్‌లోని ప్రభుత్వ హోమియోపతి ఆసుపత్రిలో సిలింగ్ పెచ్చులూడిపడ్డాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు పీజీ విద్యార్థి నులు గాయపడ్డారు. ఆసుపత్రి సిబ్బంది వెంటనే స్పందించి.. వారిని సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఒక విద్యార్థినికి తీవ్ర గాయాలు కాగా.. మరో విద్యార్థినికి స్వల్పగాయాలయ్యాయి. దీంతో తీవ్రగాయాలైన విద్యార్థినికి ఐసీయూలో వైద్యులు? చికిత్స అందిస్తున్నారు. శుక్రవారం ఉదయం ఇన్‌పేషంట్ వార్డులో ఈ ఘటన చోటు చేసుకుంది.

# ప్రజావాణి సమస్యలు పరిష్కరిస్తాం

## – ప్రజాభవన్‌లో కార్యక్రమం ప్రారంభంలో చిన్నారెడ్డి

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూన్8:** సార్వత్రిక ఎన్నికల పక్రియ ముగియడంతో పాలనా పరమైన అడ్డంకులు తొలగాయని, ప్రజావాణిలో అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరిస్తామని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా.చిన్నా రెడ్డి తెలిపారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో పునః ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమంలో చిన్నారెడ్డి పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు కారణంగా సుమారు 3 నెలల సుదీర్ఘ విరామం తరువాత ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ సమస్యలను అధికారులకు వివరించారు. అన్ని విభాగాలకు సంబందించి మొత్తం 373 దరఖాస్తులు నమోదయ్యాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 120 దరఖాస్తులు, విద్యా శాఖకు సంబందించి 43, మున్సిపల్ శాఖకు సంబందించి 43, హోం శాఖకు సంబందించి 29, పౌరసరఫరాల శాఖకు సంబందించి 18, ఇతర శాఖలకు సంబందించి 120 దరఖాస్తులు అందినట్లు ప్రజావాణి అధికార వర్గాలు తెలిపాయి. ప్రజావాణి ప్రత్యేక అధికారి, మున్సిపల్ శాఖ సంచాలకులు దివ్య, ఇతర అధికారులు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు స్వీకరించారు.

# డేటింగ్ యాప్‌తో మస్కా

- పబ్ యజమానులతో కలసి యువతుల మోసం
- ఓ యువకుడికి గంటలో 40వేల బిల్లు వేయించి పరార్

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూన్8:** డేటింగ్ యాప్‌తో పరిచయం పెంచుకుని నయా మోసాలకు తెగబడుతున్నారు. ఇదంతా యువతి, పబ్ యజమానులు కలిసి ఆడుతున్న నాటకంగా గుర్తించారు. ఓ డేటింగ్ యాప్‌లో పరిచయమవుతున్న యువతులు.. హైటెక్ సిటీలోని ఓ పబ్‌కి యువకులను తీసుకెళ్లి వేలకువేలు బిల్లు చేసి ఉడాయిస్తున్నారు. ఇలా యువ బిజినెస్ మేన్‌కు తగులుకున్న రితిక అనే యువతి గంటలో రూ.40వేల బిల్లు చేసి కనిపించకుండా జారుకుంది. ఆ పబ్ వాళ్లు ఆ డబ్బంతా కట్టాలంటూ యువకులపై ఒత్తిడి తెస్తున్నారు?! ఇప్పటివరకూ 8మంది బాధితులు వెలుగులోకి వచ్చారు..! టిండర్, బంబుల్ అనే డేటింగ్ స్కాం నగరంలో వెలుగుచూసింది. ఈ యాప్ ద్వారా పరిచయమవుతున్న యువతులు.. వెంటనే కలుద్దాం అంటూ.. వాట్సాప్ ద్వారా యువకులకు మెసేజ్ పెడుతున్నారు. ఆ యువకులను హైటెక్ సిటీలోని ఓ పబ్‌కి తీసుకెళుతున్నారు. ఆ పబ్‌లో ఖరీదైన మద్యం, ఇతర ఆహార పదార్థాలు ఆర్డర్ చేసి యువతులు కనిపించకుండా నెమ్మదిగా జారుకుంటున్నారు. గంటలో రూ.40వేల బిల్లు చూసి యువకులు ఖంగుతింటున్నారు. ఆ డబ్బంతా కట్టాలంటూ పబ్ నిర్వాహకులు ఆ యువకులపై ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికి 8మంది బాధితులుగా మారినట్లు తెలుస్తుంది. అయితే పబ్ నిర్వాహకులు, యువతులు కలిసి ఈ స్కాంకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. తాము కూడా బాధితుల మేనంటూ పలువురు ముందుకు వస్తున్నారు. దీనిపై ఇప్పటి వరకూ పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

# తెలంగాణలో వర్షాలు

- పలుచోట్ల పిడుగుపాటు
- 9మంది మృత్యువాత

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూన్8:** తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పిడుగుపాటుకు 9మంది మృతి చెందారు. ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షాలకు ఒక్క మెదక్ జిల్లాలోనే నలుగురు ప్రాణాలు కోల్పోయారు. నైరుతి రుతు పవనాల ప్రభావంతో?. తెలంగాణ మొత్తం మీద ఉరుములు పిడుగులతో కూడిన వానలు పడటంతో, ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పిడుగుపాటుతో నలుగురు మరణించారు. మెదక్ జిల్లా హవేళిఘన్‌పూర్ మండలంలోని శమ్నాపూర్ గ్రామానికి చెందిన శేట్టిబోయిన సిద్దయ్య (51), వొడంగుల నందు (22) దగ్గరలోని అడవిలోకి బుధవారం సాయంత్రం పొయ్యిల కట్టెలు తేవడానికి వెళ్లారు. వారి ఇద్దరి మీద పిడుగు పడటంతో, ఇద్దరూ కూడా అక్కడిక్కడే మరణించారు. గ్రామస్థులు ఎంత వెతికినా బుధవారం రాత్రి వరకు వారి ఆచూకీ దొరక లేదు. గురువారం ఉదయం గ్రామస్తులంతా కలిసి వెతకగా, సిద్దయ్య, నందు ఇద్దరు కూడా విగతజీవులుగా అడవిలో ఉన్న చిన్న గుట్ట పైన కనిపించారు. మెదక్ జిల్లాలోని కౌడిపల్లి మండలంలోని పీర్లతండాకి చెందిన దలావత్ గెమ్యా నాయక్ (55), తన గ్రామా శివారున పొలంలో పనిచేస్తుండగా ఉడుములు పిడుగులతో భారీ వర్షం పడటంతో, తడవకుండా ఉండటానికి చెట్టు కిందికి పరిగెత్తాడు. చెట్టు మీద పిడుగు పడటంతో, గెమ్యా నాయక్ అక్కడిక్కక్కడే మృతి చెందాడు. సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలంలో రైతు కూలి మరణించాడు. పక్కనే ఉన్న కర్నాటకకు చెందిన బిల్లిపురం గోపాల్ (40), కోహిర్ గ్రామంలో కూలికి వచ్చాడు. తాను పొలంలో పనిచేస్తుండగా, ఉరుములు పిడుగులతో కూడిన భారీ వర్షం రావటంతో, తాను చెట్టు కిందికి పరిగెత్తుతుండగా పిడుగుపడి అక్కడిక్కక్కడే మరణించాడు. పొట్టకూటి కోసం కూలికి వచ్చిన వ్యక్తి, పిడుగుపడి మరణించడంతో కుటుంబం విషాదంలో మునిగింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లలో నలుగురు చనిపోగా, నాగర్ కర్నూల్ జిల్లాలో మరొకరు మృతి చెందారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలానికి చెందిన భార్యాభర్తలు, అనక సంతోష్ (26), భార్య స్వప్న (22) తమ గ్రామమమైన డొంకర్ గాం శివారులో వారి పొలములో పనిచేస్తుండగా వారిపై పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందారు. నిర్మల్ జిల్లాలోని దిలావర్పూర్ మండలం కాల్వ గ్రామానికి చెందిన మూడరపు ప్రవీణ్ (26) పిడుగు పడటంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఇదే జిల్లా తానూరు మండలం ఎల్వత్ కి చెందిన మాగీర్వాడ్ శ్రీ (13) అనే అబ్బాయి కూడా మృతి చెందాడు. నాగర్ కర్నూల్ జిల్లాలో వెల్దండ గ్రామంలోని దిల్వార్పూర్ కు చెందిన జంగమ్మ (40) తన భర్త కృష్ణయ్య, తల్లి జంగిలి ఈదమ్మతో కలిసి వారి పొలంలో పత్తి విత్తనాలు పెడుతుండంగా, వారి పై పిడుగుపడి జంగమ్మ అక్కడిక్కడే మృతి చెందింది. కృష్ణయ్య, ఈదమ్మ కూడా తీవ్ర గాయాలతో, అపస్మారకస్థితిలోకి వెళ్లారు. వారిని దగ్గర్లోని ఆసుపత్రికి తరలించి, అక్కడినుండి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ కు తరలించారు.

## మంత్రి పొన్నం ప్రభాకరా వసూల్ రాజా: కౌశిక్ రెడ్డి

**నేటి ఫోకస్ న్యూస్, హుజురాబాద్-జూన్8:** రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ లారీ యజమానుల నుండి రోజుకు రూ. 50 లక్షల చొప్పున ఇప్పటికి రూ. 100 కోట్లు తీసుకున్నాడు. వే బిల్లులు లేకుండా అధిక లోడుతో బూడిద లారీలు వెళ్తున్నాయని కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు.రామగుండం ఎన్టీపీసీ నుండి హుజురాబాద్ మీదుగా ఖమ్మంకు ఎలాంటి వే బిల్లులు లేకుండా అధిక లోడుతో రోజుకు 300 బూడిద లారీలు వెళ్తున్నాయి. దీనికోసం రోజుకు రూ. 50 లక్షలు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వెళ్తున్నాయి. ఇలా ఇప్పటికే రూ. 100 కోట్లు వెళ్లాయి. వెంటనే మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్నామని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు.

## రామోజీ రావు పేదల పక్షపాతి


- నివాళి అర్పించిన నారా లోకేశ్

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూన్8:** మీడియా దిగ్గజం, ప్రముఖ పారిశ్రామిక వేత్త రామోజీ రావు మృతిపై పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. 'రామోజీ రావు పేదల పక్షపాతి అని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అభిప్రాయ పడ్డారు. 'అలు పెరుగని అక్షర యోధుడు. జనహితమే తన అభిమతంగా అనుకున్నారు. జీవితాంతం నిబద్ధతతో పనిచేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు స్ఫూర్తితో పనిచేశారు అని' నారా లోకేశ్ అభిప్రాయ పడ్డారు. ÷రామోజీ రావు మృతిపై హిందూపురం ఎమ్మెల్యే, ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణ సంతాపం వ్యక్తం చేశారు. 'తెలుగు పత్రికా రంగంలో రామోజీరావు మకుటం లేని మహారాజు. పత్రికా రంగంలో కొత్త ఒరవడి సృష్టించారు. భావితరాల పత్రికా ప్రతినిధులకు మార్గదర్శిగా నిలిచారు. చిత్రసీమలో అదేవిధంగా వెలిగిచారు. తెలుగు నేలపై అతిపెద్ద స్టూడియో రామోజీ ఫిల్మ్ సిటీ నిర్మించారు. తన తండ్రి ఎన్టీఆర్‌తో రామోజీ రావుకు ప్రత్యేక అనుబంధం ఉండేది. రామోజీ రావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి. ఆయన ఆత్మకు శాంతి కలుగాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా అని' నందమూరి బాలకృష్ణ అభిప్రాయ పడ్డారు.

## రామోజీ మృతికి సిపిఎం సంతాపం

- నివాళి అర్పించిన ఏచూరి, రాఘవులు

**నేటి ఫోకస్ న్యూస్, విజయవాడ-జూన్8:** ఈనాడు సంస్థలు, ప్రముఖ వ్యాపారవేత్త రామోజీరావు మరణం బాధాకరమని సిపిఐ(యం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపం తెలియజేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. రామోజీరావు తెలుగు మీడియా రంగానికి నూతన ఒరవడి దిద్దారని, పత్రికా విలువలు నిలబెట్టడంలో ఆయన ఎంతో కృషి చేశారని అన్నారు. సుందరయ్య, రాజేశ్వరరావు లాంటి ప్రముఖ కమ్యూనిస్టు నాయకుల్ని రామోజీరావు ఎంతో అభిమానించేవారని తెలియజేశారు. రామోజీరావు మృతి ప్రజాతంత్ర ఉద్యమానికి లోటని పేర్కొన్నారు.



## బహుముఖ ప్రజ్ఞాశాలి రామోజీ రావు

- ఆయన లేరన్న వార్త జీర్ణించకోలేక పోతున్నా
- తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన జనసేనాని

**నేటి ఫోకస్ న్యూస్, అమరావతి-జూన్8:** బహుముఖ ప్రజ్ఞాశాలి రామోజీ రావు లేరనే వార్త ఆవేదన కలిగించిందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. అక్షరానికి సామాజిక బాధ్యత ఉందని నిరూపించారన్నారు. అక్షరయోధుడు రామోజీ రావు తుది శ్వాస విడిచారని తెలిసి తీవ్ర దిగ్భ్రాం÷-రతికి లోనయ్యానన్నారు. అస్వస్థతతో ఆసుపత్రిలో చేరారని తెలిశాక.. కోలుకొంటారని భావించానని పవన్ తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానన్నారు. రామోజీరావు స్థాపించిన ఈనాడు పత్రిక భారతీయ పత్రికా రంగంలో పెను సంచలనంగా మారిందని పవన్ తెలిపారు. అక్షరానికి సామాజిక బాధ్యత ఉందని నిరూపించారన్నారు. ప్రజా పక్షం వహిస్తూ వాస్తవాలను వెల్లడిస్తూ, జన చైతన్యాన్ని కలిగించారని పవన్ తెలిపారు. వర్తమాన రాజకీయాలపై, పాలన తీరుతెన్నులపై నిష్కర్షగా వార్తలను అందించడమే కాదని.. ఆ వార్తలను ఉషోదయానికి ముందే పాఠకుడికి చేరేలా వ్యవస్థను ఏర్పాటు చేయడం రామోజీరావు దక్షతను తెలియచేసిందన్నారు. ప్రజా ఉద్యమాలకు రామోజీ వెన్నుదన్నుగా నిలిచారని పవన్ అన్నారు. పత్రికాధిపతిగానే కాకుండా సినీ నిర్మాతగా, స్టూడియో నిర్వాహకులుగా, వ్యాపారవేత్తగా బహుముఖంగా విజయాలు సాధించారన్నారు. రామోజీ ఫిల్మ్ సిటీ నిర్మాణంతో భారతీయ చిత్ర పరిశ్రమకు హైదరాబాద్‌ను వేదికగా చేశారన్నారు. మీడియా మొఘల్‌గా రామోజీరావు అలుపెరుగని పోరాటం చేశారన్నారు. తను నమ్మిన సిద్దాంతాలకు కట్టుబడి ముందుకు వెళ్ళడం ద్వారా ప్రజల్లో విశ్వసనీయత సాధించారన్నారు. అక్షర యోధుడు రామోజీ రావు గారు అస్తమయం తెలుగు ప్రజలందరినీ కలచి వేస్తోందన్నారు. ఆయన స్ఫూర్తిని నవతరం పాత్రికేయులు అందిపుచ్చుకోవాలన్నారు. రామోజీరావు కుటుంబానికి తన తరఫున, జనసేన పక్షాన ప్రగాఢ సానుభూతిని పవన్ తెలిపారు.

## ఎన్నో విషయాలు పంచుకుందామనుకున్నా

- రామోజీ భౌతిక కాయం వద్ద నివాళి అర్పించిన పవన్

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూన్8:** ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మరణంతో కలత చెందానని జనసేనాని పవన్ కళ్యాన్ అన్నారు. ఆయన లేరన్న విషయాన్ని తెలు మీడియా ఇండస్టీ జీర్ణించుకోలేకపోతోంది. తెలుగు రాష్ట్రలకు చెందిన సినీ, రాజకీయ ప్రముఖులతో పాటు యావత్ ప్రపంచ వ్యాప్తంగా తెలుగు ప్రజలు, ప్రముఖులు మీడియా, సోషల్ మీడియా వేదికగా రామోజీ మరణంపై స్పందిస్తున్నారు. ఢిల్లీ పర్యటనలో బిజిబిజీగా ఉన్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ హుటాహుటిన హైదరాబాద్ చేరుకున్నారు. తన మిత్రుడు, టాలీవుడ్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో కలిసి ఫిల్మ్‌సిటీకి వెళ్లిన పవన్.. రామోజీరావు భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన పవన్.. పలు విషయాలు పంచుకున్నారు. 'రామోజీరావు మృతి దిగ్భ్రాంతి కలిగించింది. రామోజీరావు మహోన్నతమైన వ్యక్తి. తెలుగు రాష్ట్రల్లో వేలాది మంది జర్నలిస్టులు ఈనాడు జర్నలిజం స్కూలు నుంచే వచ్చారు. ఇప్పుడున్న ఏ జర్నలిస్ట్‌కు అయినా ఈనాడు రూట్స్ ఉంటాయి. అలా వేలాది మంది జర్నలిస్టులను రామోజీరావు అందించారు. సినీ ఇండస్ట్రీకి కూడా ఆయన ఎంతో చేశారు. రామోజీరావును గత కొన్నేళ్లుగా ప్రభుత్వాలు చాలా ఇబ్బంది పెట్టాయి.. వాటన్నింటినీ ఈ వయసులో కూడా తట్టుకున్నారు. ఇబ్బంది పెట్టిన ప్రభుత్వాలు ఈ రోజు లేవు. ఇదే విషయాన్ని రామోజీరావుకు చెప్పాలని అనుకున్నాను. ప్రమాణస్వీకారం తర్వాత వచ్చి కలుద్దామనుకున్నాను. దురదృష్ణం ఇంతలోనే ఇలా జరిగిపోయింది. ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి అండగా నిలబడ్డారు. ఆయన కుటుంబానికి భగవంతుడు అండగా ఉండాలి. జనసేన తరపున సంతాపం తెలియజేస్తున్నాను' అని పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు.

## రామోజీ మృతికి సినీ ప్రముఖుల దిగ్భ్రాంతి

- రాజమౌళి, కీరవాణి, రాజేంద్రప్రసాద్ తదితరుల నివాళి
- నేడు చిత్ర పరిశ్రమ బందుకు పిలుపు

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూన్8:** ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు కన్నుమూసిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఆయన పార్థివదేహాన్ని రామోజీ ఫిల్మ్ సిటీకి తరలించారు. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు అక్కడికి తరలివెళ్లి మీడియా సంస్థ అధినేతకు నివాళులర్పిస్తున్నారు. రామోజీ రావు మరణ వార్త సినీ ఇండస్ట్రని తీవ్రంగా కలచివేసింది. సంతాప సూచికంగా ఆదివారం చిత్ర పరిశ్రమకు బంద్ ప్రకటించారు. ఈ మేరకు చలనచిత్ర నిర్మాతల మండలి ప్రకటన విడుదల చేసింది. ఆదివారం అన్ని షూటింగ్‌లూ నిలిపివేస్తున్నట్లు తెలిపింది. ఇదిలావుంటే ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు శనివారం ఉదయం తుది శ్వాస విడిచారు. ఆయన పార్థివదేహాన్ని రామోజీ ఫిల్మ్‌సిటీకి తరలించారు. ఈ సందర్భంగా ఆయనకు నివాళులర్పించేందుకు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పెద్ద ఎత్తున అక్కడికి తరలివచ్చారు. టాలీవుడ్ దర్శకధీరుడు ఎస్ఎస్ రామజౌళి, ఆయన భార్య రమా రాజమౌళి, కీరవాణి, రాజేంద్ర ప్రసాద్, ఏపీ మాజీ మంత్రి పరిటాల సునీత, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు, బ్యాడ్మింటన్ కోచ్ పు÷-లలెల గోపీచంద్ తదితరులు రామోజీ పార్థివదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళు లర్పించారు.